TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 287 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.13.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్ల పైనా చర్యలు తప్పవు : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్?కు తరలించాలన్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం : రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ధాన్యం సేకరణలోని సమస్యలపై వివరాలను తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా ధాన్యం సేకరణలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతన్నలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం పూర్తి వివరాలను ఆయా జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

లారీలు అందుబాటులో ఉండాలి : సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులోకి తీసుకురాని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు బుక్? చేయాలని ఆదేశించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్?కు ఆదేశాలు జారీ చేశారు.

ధాన్యం, మొక్కజోన్న కొనుగోలు సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గిడ్డంగుల సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ధాన్యం సేకరణ సాఫీగా జరగాలి : సేకరించిన ధాన్యాన్ని తాత్కాలికంగా రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్?కు తరలించాలని సీఎం సూచించారు. వెసులుబాటు ఆధారంగా అక్కడి నుంచి గోడౌన్స్?కు తరలించేలా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దని చెప్పారు. అవసరమైన చోట పోలీసుల సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్?కు నివేదికలు పంపాలని తెలిపారు.

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని సీఎం తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించండి : కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు.

## నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత కేంద్రానిదే: కేటీఆర్



హైదరాబాద్:అమృత్ తెలంగాణ: నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దుచేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ మేరకు తాజాగా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. “2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైంది. జాతీయ అర్హత పరీక్ష నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న ఈ అసమర్థత విద్యార్థుల పట్ల శాపంగా మారింది. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ కావడం వ్యవస్థలో ఉన్న దారుణమైన లోపాలను బయటపెట్టింది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్ గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలి. దీని వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శిక్షించాలి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలి.” అని ఎక్స్ పోస్ట్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## మోడీ గారు..ప్రజలకు నీతులు చెప్పే ముందు పాలకులు వాటిని ఆచరించాలి: శంకరాచార్య స్వామి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు పొదుపు పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుపై జ్యోతిష్ పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద తీవ్రంగా స్పందించారు. ప్రజలకు నీతులు చెప్పే ముందు పాలకులు వాటిని ఆచరించి చూపించాలని, పొదుపు చర్యలు అధికారంలో ఉన్న వారి నుంచే మొదలవ్వాలని ఆయన హితవు పలికారు. సోన్‌భద్రలో తన ‘గోవిష్ఠ యాత్ర’లో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. “ముందుగా ప్రభుత్వం తమ వద్ద ఉన్న రూ. 8,000 కోట్ల విమానాన్ని అమ్మి, ఇంధన సామర్థ్యం ఉన్న విమానాన్ని ఉపయోగించాలి. ధర్మం మన ఇంటి నుంచే మొదలవ్వాలి” అని ప్రధాని మోడీకి ఆయన చురకలంటించారు. పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలు, ఇంధన వినియోగం తగ్గించుకోవాలని మోడీ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. గోవధను అరికట్టడంలో రాజకీయ పార్టీలు, నాయకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరప్రదేశ్‌లోనే గోవుల జనాభా అత్యంత వేగంగా తగ్గిపోయిందని ఆయన పేర్కొన్నారు.

## ‘ప్రధాని అమృత్ కాలం దేశానికి విషంగా మారింది’- నీట్ రద్దుపై రాహుల్ గాంధీ ఫైర్

న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: నీట్ రద్దుపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న అమృత కాలం యువత పాలిట విషంగా మారిపోయిందని అన్నారు. నీట్ రద్దుతో 22 లక్షల మంది విద్యార్థుల కలలు ఛిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరో తండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివించారని, తల్లులు నగలమ్మి కోచింగ్ ఫీజులు కట్టారని రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తమ పిల్లలు నీట్ కోచింగ్ ఖర్చు భరించడం కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేశారని, కానీ ప్రతిఫలంగా వారికి పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా రంగంలో అవినీతి ఎదురవుతున్నాయని అన్నారు. లక్షల మంది పిల్లలు రాత్రింబవళ్లు నిద్రలేకుండా చదివారన్న ఆయన, ప్రభుత్వ వైఫల్యం వల్ల విద్యార్థులు దారుణంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఇది కేవలం వైఫల్యం మాత్రమే కాదని, తీవ్రమైన నేరమని మండిపడ్డారు. ప్రతిసారీ పేపర్ లీక్ మాఫియా శిక్ష లేకుండా తప్పించుకుంటోందన్న కాంగ్రెస్ అగ్రనేత, చేయని తప్పుకు విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు.

“నీట్ 2026 పరీక్షను రద్దు చేశారు. 22 లక్షలకు పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలను ఈ అవినీతి బీజేపీ ప్రభుత్వం నాశనం చేసింది. కొందరు తండ్రులు అప్పులు చేశారు. మరి కొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది పిల్లలు రాత్రంతా మేల్కొని చదువుకున్నారు. దానికి ప్రతిఫలంగా వారికి పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యారంగంలో వ్యవస్థీకృత అవినీతి ఎదురయ్యాయి. ఇది కేవలం వైఫల్యం మాత్రమే కాదు. ఇది యువత భవిష్యత్తుపై చేసిన నేరం. ప్రతిసారీ పేపర్ లీక్ మాఫియా తప్పించుకుంటుండగా, నిజాయితీపరులైన విద్యార్థులు మాత్రం శిక్షను అనుభవిస్తున్నారు. ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థిక భారాన్ని భరించనున్నారు. ఒకరి తలరాతను కష్టంతో కాకుండా డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక చదువుకు అర్థం ఏముంటుంది? ప్రధానమంత్రి అమృత యుగం దేశానికి విష యుగంగా మారింది.”

--రాహుల్ గాంధీ, లోక్ సభ ప్రతిపక్ష నేత

‘లోపభూయిష్టమైన వ్యవస్థతో ప్రభుత్వం విద్యార్థులను శిక్షిస్తోంది’

మరోవైపు నీట్ రద్దుపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. లోపభూయిష్టమైన వ్యవస్థతో ప్రభుత్వం విద్యార్థులను శిక్షిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేంద్రంపై విరుచుకుపడ్డారు.



“పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నీట్-యూజీ 2026 పరీక్ష మరోసారి రద్దయింది. రేయింబవళ్లు కష్టపడి చదువుకున్న లక్షలాది మంది విద్యార్థులు, పూర్తిగా లోపభూయిష్టమైన వ్యవస్థ కారణంగా శిక్షకు గురవుతున్నారు. ఏటా అదే కుంభకోణం, అవే సాకులు, అదే వేదన. ఈ విద్యార్థుల భవిష్యత్తును ఎవరు నాశనం చేశారు? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అవినీతి, అసమర్థత కారణంగా ఇంకెంతమంది యువ మేధావులు ఒత్తిడి, మానసిక వేదనను అనుభవించాల్సి వస్తుంది? నిష్పక్షపాతంగా వైద్య ప్రవేశ పరీక్షను నిర్వహించలేని ఒక దేశం, ఇతరులకు ‘నవ భారతం’ గురించి నీతులు చెప్పలేదు. లోపభూయిష్టమైన వ్యవస్థ. లోపభూయిష్టమైన జవాబుదారీతనం. లోపభూయిష్టమైన ప్రధాని.” అని మాణికం ఠాగూర్ మండిపడ్డారు.

నీట్ను రద్దు చేసిన ఎన్టీఏ

అంతకుముందు నీట్ యూజీ-2026 పరీక్ష రద్దు చేస్తూ నేషల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్ష ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు తేలగా పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

## టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ నేపథ్యంలో నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. రేపు విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

# ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వివరించిన జిల్లా కలెక్టర్

## ఎంఐఎం కు తొత్తుగా వ్యవహరిస్తున్న అధికారులు
## కో ఆప్షన్ ఎన్నిక జరిగే వరకు ఊరుకునేది లేదు
## కౌన్సిలర్ల దీక్షకు సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ జిల్లా మే 12 అమృత్ తెలంగాణ బైంసా మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నిక వాయిదా వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించడమేనని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి తో పాటు బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు సోమవారం అర్ధరాత్రి నుండి ఆందోళన చేపట్టి నిరాహార దీక్షకు పూనుకున్న సందర్భంగా వారికి సంఘీభావం ప్రకటించి ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి కో ఆప్షన్ ఎన్నిక జరుపుతామని సోమవారం కలెక్టర్ చెప్పగా ఆయన అనుమతితోనే 12వ తేదీన ఎన్నిక జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలియజేసినప్పటికీ, రాత్రివేళ కో ఆప్షన్ ఎన్నిక రద్దు అయినట్లు వాట్సాప్ మెసేజ్ పంపడం సరి కాదన్నారు . ఎన్నిక ఎందుకు వాయిదా వేశారో తెలియజేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పై ఉందన్నారు. ఎన్నిక వాయిదా వేశారంటే అధికారులు ఎంఐఎంకు, ప్రభుత్వానికి వత్తాసు పలకడమేనన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ , అధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లనున్నట్లు చెప్పారు. అవసరమైతే ప్రజాస్వామానికి విరుద్ధంగా వ్యవహరించిన తీరుపై అసెంబ్లీలో మాట్లాడతానన్నారు. ఎన్నిక నిర్వహించే వరకు కౌన్సిలర్లు చైర్మన్ అక్కడే బైఠాయిస్తారని వారికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు బైంసా మున్సిపాలిటీని పాలించిన ఎంఐఎం పార్టీకి ఇంకా అధికార దాహం వీడలేదన్నారు. ప్రజలు తమకు అధికారమిస్తే ఎంఐఎం పార్టీ ఓర్వలేకనే కుట్రలకు పాల్పడుతుందన్నారు. మున్సిపల్ పాలకవర్గం నియమకమై కేవలం రెండు నెలలు మాత్రమే అయిందని, ఎంఐఎం నాయకుల వ్యవహారం సరికాదన్నారు. పాలకవర్గం


కౌన్సిలర్లతో దీక్షకు కూర్చున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

పిలుపుమేరకు బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. దీక్షలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి,వైస్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. వీరు చేపడుతున్న దీక్షకు పెద్ద మొత్తంలో ప్రజలు సంఘీభావం ప్రకటించారు.

## ప్రజాపాలన--ప్రగతిప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా భీంపూర్ మండల కేంద్రంలో రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) నూతన భవనాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజాపాలన-- ప్రగతిప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా భీంపూర్ మండల కేంద్రంలో రూ. 2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) నూతన భవనాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు. అనంతరం వారు పాఠశాల ఆవరణను పరిశీలించి విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, గిరిజన, పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు కనీస వసతులు కూడా అందుబాటులో ఉండేవి కాదని, ప్రస్తుతం ఆధునిక సదుపాయాలతో కూడిన పాఠశాల భవనాలు, వసతి గృహాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, గిరిజన బాలికల విద్యాభివృద్ధికి కేజీబీవీలు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. గ్రామీణ, అట్టడుగు వర్గాల బాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

పేద కుటుంబాలకు చెందిన బాలికలు చదువులో రాణించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, ఎస్. ఓ రజినీ, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకూడదు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.


నిర్మల్ జిల్లా మే 12 అమృత్ తెలంగాణ మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్ని సంచులు, ధాన్యం తరలింపునకు లారీలు, ధాన్యం నిల్వ చేయడానికి తగిన స్థలాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం సరఫరాకు అవసరమైతే లారీలతో పాటుగా ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం తరలింపుకు సంబంధించి లారీల కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియకు అవసరమైతే స్థానిక హమాలీలను నియమించుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రశీదులు ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు తమ పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు


జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం

సాఫీగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి అన్లోడింగ్ పాయింట్ లు దగ్గర్లో ఉంటే ట్రాక్టర్ల ద్వారా ధాన్యం సంచులు తరలించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. ధాన్యం తూకం, తరలింపులో ఎట్టి పరిస్థితుల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఈ వీసీ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జొన్న మొక్కజొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్ష






అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్: జిల్లాలో జొన్న, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో ఆయన గూగుల్ మీట్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని,. ముఖ్యంగా పీఏసీఎస్ కార్యదర్శులు, సెంటర్ ఇన్చార్జీలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి, ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. సేకరించిన పంటను మిల్లులకు లేదా గోదాములకు తరలించే విషయంలో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా రవాణా అధికారి, ఎంవీఐలు సమన్వయం చేసుకుంటూ తగినన్ని వాహనాలను అందుబాటులో ఉంచాలని, ఎక్కడా లోడింగ్ జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. పిన్ పాయింట్ అధికారులు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చిత్రూ,పాల్గొన్నారు.

# వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.




విద్యార్థులతో కలెక్టర్

నిర్మల్ జిల్లా మే 12 అమృత్ తెలంగాణ వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం, పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు ఏంటో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సమ్మర్ క్యాంప్ కి రావాలని చెప్పారు. సమ్మర్ క్యాంపులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. వారి భయాలు, సందేహాలు తొలగించి, వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నర్సుల సేవలు అమూల్యం

## అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా






అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ వైద్య రంగంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య సేవల్లో నర్సులు చూపుతున్న అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోగుల పట్ల నర్సులు చూపే కరుణ, సేవాభావం వెలకట్టలేనివని కొనియాడారు. వైద్యులు చికిత్స అందిస్తే, నర్సులు తమ వృత్తిపట్ల ఉన్న అంకితభావంతో రోగులు త్వరగా కోలుకునేలా చేస్తారని అన్నారు. అందుకే వారిని గౌరవప్రదంగా 'సిస్టర్స్' అని పిలుస్తామని పేర్కొన్నారు. రిమ్స్ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డిప్యూటీ సూపరింటెండెంట్ నరేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్లు కల్పన, రమాదేవి, ఉమ, నర్సింగ్ సిబ్బంది, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

# బొట్టు, దుస్తులపై ఉన్న శ్రద్ధ..పేపర్ లీకేజీలపై లేదా?

అచ్చంపేటఅమృత్ తెలంగాణ: నీట్ పరీక్ష రద్దు పేపరు లీక్ అనే అంశం పై బొట్టు దుస్తులపై ఉన్న పెద్ద పేపర్ లీకేజీలపై లేదా విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మహేష్ మంగళవారం ప్రకటనలో ఆరోపించారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం చాలా దారుణమని అన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. (చీూ) విద్యార్థులపై మాత్రం కఠిన నిబంధనలు అమలు చేస్తోందని, పరీక్ష కేంద్రాలకు కొన్ని నిమిషాలు ఆలస్యమైనా లోపలికి అనుమతించరని, బొట్టు, దుస్తులు, చెప్పులు, జుట్టు క్లిప్ల వరకు చెక్ చేస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కానీ అసలు ప్రశ్నాపత్రం ఎలా బయటకు వెళ్లింది..? పేపర్ లీక్ మాఫియాలు ఎలా యాక్టివ్ అయ్యాయి...? అనే విషయంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. "విద్యార్థుల బొట్టు కనిపిస్తుంది కానీ పేపర్ లీక్ కనిపించదా...? దుస్తుల మీద శ్రద్ధ ఉంటుంది కానీ పరీక్ష భద్రత మీద ఉండదా..? సమయ నియమాలపై కఠినంగా ఉండే అధికారులు, పేపర్ లీక్ మాఫియాల ముందు ఎందుకు చేతులెత్తేశారు..?" అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు



రాత్రింబవళ్లు కష్టపడి చదువుతూ నీట్ కోసం సిద్ధమవుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లలకు కోచింగ్లు పెట్టిస్తున్నారని, తమ పిల్లలు డాక్టర్లు కావాలనే ఆశతో ఎన్నో త్యాగాలు చేస్తున్నారని చెప్పారు. అలాంటి విద్యార్థుల భవిష్యత్తుతో ఇలా ఆటలు ఆడటం అమానుషమని అన్నారు. పరీక్ష రద్దు చేసి మళ్లీ పరీక్ష పెడతామని చెప్పడం సమస్యకు పరిష్కారం కాదని, ఇప్పటికే విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యారని అన్నారు.

# వెల్లుల లో దేశ జనాభా గణన



అమృత్ తెలంగాణ మెట్టుపల్లి రూరల్. మే 12: జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం వెల్లుల్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భారత దేశ జనాభా గణన 2027, ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణనా హెచ్ఎల్ఓ 2026 కార్యక్రమం లో భాగంగా సమాచార సేకరణ నిర్వహించారు. ఇంటింటి సర్వేలో అధికారులతో పాటు గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి పాల్గొనిశీఅ పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి నారాయణ, జిపిఓ నాగరాణి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమం 2026లో జరుగుతోంది.

# గోన గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం -- కొమరం భీం విగ్రహ ఆవిష్కరణ

గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం,కొమరం భీం ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలి:బోరంచు శ్రీకాంత్ రెడ్డి






అమృత్ తెలంగాణ తాంసి న్యూస్ భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గోన గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంతో పాటు కొమరం భీం విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాలు కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.అలాగే జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీం ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని అన్నారు.ఆదివాసీ గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటాన్ని యువత గుర్తుంచుకొని ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తన్వీర్ హైమద్, గ్రామ సర్పంచ్ మడావి కమలాబాయి, ఉప సర్పంచ్ ఎండి ముశ్రాన్ హైమద్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# కేజీబీవీ భీంపూర్‌లో ఘనంగా ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమం

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది: బోరంచు శ్రీకాంత్ రెడ్డి




అమృత్ తెలంగాణ తాంసి న్యూస్ భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక ఎడ్యుకేషన్ వీక్" కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేజీబీవీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తునుబలోపేతంచేసేదిశగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవు తుందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భీంపూర్ సర్పంచ్‌రంజన, కప్పర్ల సర్పంచ్ అరుణ్ కుమార్, స్థానిక నాయకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్




జగిత్యాల అమృత్ తెలంగాణ మే 12: పట్టణంలోని మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో మంగళవారం, సీఎం సహాయ నిధి ద్వారా 61 మందికి 15.70 లక్షల రూపాయల విలువైన చెక్కులను, 89 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ పథకం కింద 89 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పట్టణ, మండల నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన రాజరాజేశ్వర మిల్క్ పార్లర్ యజమాని తోట్ల మాధవన్



కోరుట్ల అమృత్ తెలంగాణ మే 12: జగిత్యాల జిల్లా, కోరుట్ల, భీమారం గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీ రాజ రాజేశ్వర మిల్క్ పార్లర్ యజమాని తోట్ల మాధవన్ ఆర్థిక సహాయంతో సుమారు 150 మంది కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కపల్లి స్వాతి-సంజీవ్, వార్డ్ మెంబర్ పల్లికొండ సాయి, గ్రామ నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మావతి పాల్గొన్నారు. కూలీలకు చల్లని మజ్జిగ అందించిన మాధవ్‌ను సర్పంచ్, నాయకులు అభినందించారు.

# తాంసి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత తెలంగాణ తాంసి న్యూస్ తాంసి: తాంసి మండల కేంద్రంలోని తెల్ల జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి జొన్నలతో పాటు ఇతర ఏ పంటలు సాగు చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి ఎలా ఉందని, ఇటీవల కురిసిన అకాల వర్షాల ప్రభావం ఏమైనా ఉందా అని రైతులను ప్రశ్నించారు. అనంతరం రైతులు షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనను సంప్రదించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జొన్న కొనుగోళ్లు చేపట్టాలని మార్కెట్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన తాసిల్దార్ కు రేషన్ డీలర్ల సంఘం సన్మానం.



మల్లాపూర్ అమృత్ తెలంగాణ మే 12: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీ రామ్ చందర్ ని, మండల రేషన్ డీలర్ల సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దప్పుల నర్సయ్య, గౌరవ అధ్యక్షులు ముద్దం ప్రకాష్, గంగాధర్, వెంకట్, లలిత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు. ఈ సన్మానం మంగళవారం, 12 మే 2026న జరిగింది.

# బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుటుంబాన్ని పరామర్శించిన సురభి నవీన్ కుమార్



కోరుట్ల అమృత్ తెలంగాణ మే 12: జగిత్యాల జిల్లా, కోరుట్ల పట్టణంలో ఇటీవల బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు బెక్కం అశోక్తండ్రి మరణించడంతో, వారి కుటుంబాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బిజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా వారిని కలిసి సంతాపం తెలిపారు.

# తెల్ల జొన్నల కొనుగోలులో రైతులు షెడ్యూల్ పాటించాలి

రైతుల కోసం మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేస్తున్నాం: మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తెల్ల జొన్నలు విక్రయానికి తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా మార్కెట్ కమిటీ రూపొందించిన షెడ్యూల్‌ను పాటించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి రైతు ముందుగా కేటాయించిన షెడ్యూల్ ప్రకారమే ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని తెలిపారు. సోమవారం రాత్రి దాదాపు 60 ట్రాక్టర్లలో రైతులు షెడ్యూల్ లేకుండా మార్కెట్ యార్డుకు రావడం జరిగిందన్నారు. అయినప్పటికీ రైతులకు వాహనాల చార్జీలు భారం కాకూడదనే ఉద్దేశంతో తాను అర్ధరాత్రి వరకు మార్కెట్ యార్డులో ఉండి కొనుగోలు ప్రక్రియను కొనసాగించినట్లు చెప్పారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు షెడ్యూల్ విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. ఇకపై షెడ్యూల్‌కు విరుద్ధంగా ధాన్యం తీసుకువస్తే కొనుగోలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇందుకోసం ఇస్కాన్ సంస్థతో పాటు దాతల సహకారం కోరినట్లు పేర్కొన్నారు. రైతులు మార్కెట్ కమిటీ సిబ్బందికి సహకరించి కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రియాంక రాజశేఖర్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా అన్నదాన కార్యక్రమం



మెట్పల్లి అమృత తెలంగాణ మే 12 : మెట్పల్లి పట్టణ ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తరి ప్రియాంక రాజశేఖర్ ల 12వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా హాస్పిటల్ అటెండర్లకు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలు ప్రియాంక రాజశేఖర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పుల్ల శ్రీనివాస్ గౌడ్, జలధి న్యూస్ రిపోర్టర్ బెజ్జారపు వినోద్ కుమార్, దేవా న్యూస్ రిపోర్టర్ రవిరాజ్ లు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీఆర్ఎస్ నాయకుల అవినీతి బండారం బయటపెడతాం

మిడ్జిల్:అమృత్ తెలంగాణ: జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో నడిపిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అనుచరులతో వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని, బి ఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు చేసింది ఏమీ లేదని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో లక్షల రూపాయలు అవనీతికి పాల్పడినారని, మాజీ మంత్రి అవినీతి నీ వెలికి తీసి ఆయన బండారాని బయటపెట్టి ప్రజల ముందు ఉంచుతామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్వాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మల్లికార్జున రెడ్డి, మహమ్మద్ గౌస్, మిడ్జిల్ సర్పంచ్ ఎడ్ల శంకర్ అన్నారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి స్వగ్రామంలో మంగళవారం సర్పంచులు ధర్మానాయక్ , గోదా శ్రీశైలం యాదవ్, సువర్ణ తో కలిసి ఏర్పాటు చసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని , గత పాలకుల పరిపాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మీరు చేసిన అక్రమాలు, అన్యాయాలు, చూసే ప్రజలు మిమ్ములను దూరం పెట్టారని పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో మీరు చేసిన అక్రమాలు, అవినీతిని వెలికి తీసి మీ బండారాన్ని బయట పెట్టే వరకు మిమ్ములను వెంటాడుతామని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, భాస్కర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మున్నూరు జంగయ్య, వెంకట శివప్రసాద్, మార్కెట్ డైరెక్టర్లు సత్యం, బంగారు, నాయకులు భాస్కర్ నాయక్, రాజేందర్ రెడ్డి, కృష్ణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు ఉన్నారు.

## రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 12, 2026: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జైపూర్ మండలం ఇందారంలోని జయలక్ష్మి రైస్ మిల్లు, మందమర్రి మండలం అందుగులపేటలోని వెంకటేశ్వర రైస్ మిల్లులను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టం సామాన్యులకేనా.?

తిమ్మాజిపేట :అమృత్ తెలంగాణ: కేంద్ర మంత్రి బండి సంజయ్, కుమారుడు బండి భగీరథ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 17 ఏళ్ల మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు కావడం రాష్ట్ర వ్యాప్తంగా సంచ లనంగా మారిందని, ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక ఫిర్యాదు వంటి అత్యంత సున్నితమైన అంశంలో ప్రభుత్వం, పోలీసులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించి బాధితురాలికి తక్షణ న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేసు నమోదై ఉన్నప్పటికీ బండి భగీరథ్ ఇప్పటికీ ఎక్కడ ఉ న్నాడు..? ఎందుకు అరెస్టు చేయడం లేదు..? చట్టం సామాన్యులకేనా? అని ప్రశ్నించారు. సామాన్యులకు ఒకలాగా, అధికార పార్టీలకు మరోలా అమలవుతుందని అన్నారు. బాధిత బాలికకు అన్యాయం చేయాలని మధ్యవర్తిత్వం వహిం చిన సంగప్పపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తీర్మాన ప్రతి సమర్పించడంలో ఆలస్యంపై సర్పంచ్ కు షో కాజ్ నోటీసు జారీ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 12, 2026: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి సంబంధించిన గ్రామపంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో జాప్యంపై చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల మల్లేష్ కు షో కాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చి, మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలం సోమన్‌పల్లి గ్రామ పంచాయతీలో మంజూరు చేసి పాఠశాల నిర్మాణానికి తగినంత నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన గ్రామ పంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నట్లు గమనించడం జరిగిందని, ఈ విషయమై సరైన వివరణ కోరుతూ నోటీసు జారీ చేయడం జరిగిందని, సకాలంలో వివరణ అందించని పక్షంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 37(5) చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బండి భగీరథను అరెస్టు చేయాలని.. DYFI,AIDWA,SFI ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహబూబ్ నగర్, హనుమకొండ DYFI,AIDWA,SFI నిరసనలు చేపట్టాయి. హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ వద్ద బండి భగీరథ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బండి సంజయ్ పాత్రపై విచారణ చేపట్టి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మహబూబ్ నగర్ తెలంగాణ చౌరస్తాలో బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

## అర్బన్ కాలనీ వాసులకు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన నీరు అందుతుందని హామీ ఇచ్చిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్పల్లి అమృత తెలంగాణ మే 11: ఈరోజు మెట్ పల్లి పట్టణం అర్బన్ కాలనీ ప్రజల చిరకాల వాంఛ అయిన నీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా మున్సిపల్ యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ కాలనీలో జరుగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

సోమవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు పనుల నాణ్యతను పరిశీలించి, ఎక్కడా జాప్యం జరగకుండా తొందరగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన నీరు అందుతుందని హామీ ఇచ్చారు.

పట్టణంలోని అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యత అని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కాంగ్రెస్ నాయకులు శ్రీ మైలారపు రాంబాబు, కౌన్సిలర్లు వార్డు ప్రజలు పాల్గొన్నారు..

## హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ రఘు

మెట్పల్లి అమృత్ తెలంగాణ మే 12: పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా పైడిమడుగు ఆంజనేయ స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ ప్రజానాయకుడు డా.రఘు ఆలయాన్ని సందర్శించి శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బడుగు బూమేష్, ఉపసర్పంచ్ గాంధారి సుజాత శ్రీనివాస్, వార్డు సభ్యుడు ఆకువతిని నిరంజన్, చెలివేరి సురేష్, అంకం ప్రకాష్, మామిడాల భూవేశ్వర్, మాలధారణ చేసిన స్వాములతో కలిసి భక్తి శ్రద్ధలతో స్వామివారికి సేవలందించారు.



అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో డా.రఘు పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు.


## ప్రేమలు బ్యూటీకి మరో బంపర్ ఆఫర్..!




తెలుగులో ఎప్పటి నుంచో నటించాలని ఉన్నా సరైన కథ దొరక్క సైలెంట్ గా ఉంది మమితా బైజు. మలయాళ భామ మమితా బైజు ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ ని తెచ్చుకుంది. ప్రేమలు ఒక రెగ్యులర్ లవ్ స్టోరీనే కానీ అందులో నటించిన మమితా తన క్యూట్ లుక్స్, ఎక్స్ ప్రెషన్స్ తో యువత హృదయాలను దోచేసింది. ప్రేమలు బ్యూటీకి వచ్చిన ఈ క్రేజ్ ని క్యాష్ చేసుకోవాలని దర్శక నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్ లో మమితా బైజుకి ఉన్న ఫ్యాన్స్ దృష్టిలో ఉంచుకుని ఆమెను ఇక్కడ సినిమాల్లో తీసుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే మాస్ మహరాజ్ రవితేజ సినిమాలో మమితా నటిస్తుందని తెలుస్తుంది. కిశోర్ తిరుమల డైరెక్షన్ లో చేస్తున్న అనార్కలి సినిమాలో మమితా బైజు నటిస్తుందని టాక్. ఈ సినిమాలో కయదు లోహార్ కూడా మరో హీరోయిన్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఐతే ఈ సినిమాతో పాటుగా మమితా టాలీవుడ్ లో మరో బంపర్ ఆఫర్ అందుకుందని ఫిల్మ్ నగర్ టాక్. తెలుగులో ఒక క్రేజీ సినిమాలో హీరోయిన్ గా మమితాని ఓకే చేశారట. క్రేజీ హీరో స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని తెలుస్తుంది. మమితా కూడా స్టోరీ వినగానే కనెక్ట్ అయ్యిందట. తెలుగులో ఎప్పటి నుంచో నటించాలని ఉన్నా సరైన కథ దొరక్క సైలెంట్ గా ఉంది మమితా బైజు. ఐతే ఇప్పుడు అమ్మడు వరుస తెలుగు సినిమాలు చేసేందుకు రెడీ అయ్యింది. రవితేజ సినిమాలో మంచి రోల్ చేస్తుందని తెలుస్తుండగా ఈ సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు లాక్ అయినట్టు తెలుస్తుంది. స్క్రీన్ మీద మమితా క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ కుర్రాళ్లను గిలిగింతలు పెట్టిస్తుంది. అందుకే యూత్ లో ఆమెకు ఉన్న ఈ క్రేజ్ ని పర్ఫెక్ట్ గా వాడుకోవాలని చూస్తున్నారు. మమితా బైజు తెలుగుతో పాటుగా తమిళ్, మలయాళ సినిమాల్లో రాణిస్తుంది. ప్రస్తుతం అమ్మడు దళపతి విజయ్ జన నాయగన్ లో కూడా ఇంపార్టెంట్ రోల్ చేస్తుంది. ఆ సినిమాలో పూజా హెగ్డే కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సౌత్ లో తన మార్క్ నటనతో ఆకట్టుకుంటున్న మమితా తెలుగులో బిజీ హీరోయిన్ గా ఛాన్స్ లు అందుకోవాలని చూస్తుంది.

## టాప్ స్టార్లు చేయలేనిది విజయ్ చేస్తున్నాడు

ఇండస్ట్రీలో ఒకరు చేయాల్సిన సినిమాలు మరొకరికి వెళ్లడం చాలా కామనైపోయింది. ఇండస్ట్రీలో ఒకరు చేయాల్సిన సినిమాలు మరొకరికి వెళ్లడం చాలా కామనైపోయింది. ఈ మధ్య అది మరీ ఎక్కువైపోయింది. 2023లో హాయ్ నాన్న సినిమాతో డైరెక్టర్ గా టాలీవుడ్ కు పరిచయమైన శౌర్యువ్ మొదటి సినిమాతోనే మంచి హిట్ ను తన అకౌంట్ లో వేసుకున్నాడు. హాయ్ నాన్న లాంటి కత్తిమీద సాము కథను అతను డెలివర్ చేసిన విధానం అందరినీ మెప్పించింది. దీంతో హాయ్ నాన్న తర్వాత శౌర్యువ్ ఎవరితో సినిమా చేస్తాడనే ఆసక్తి అందరిలోనూ పెరిగిపోయింది. కానీ ఆ సినిమా రిలీజై ఏడాది దాటినా ఇప్పటికీ శౌర్యువ్ తన నెక్ట్స్ మూవీని అనౌన్స్ చేసింది లేదు. మధ్యలో ఎన్టీఆర్ తో సినిమా చేస్తాడని అన్నారు కానీ అది పట్టాలెక్కలేదు. ఎన్టీఆర్ కోసం శౌర్యువ్ ఓ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాను రెడీ చేసుకున్నాడు. ఆ యాక్షన్ మూవీని ఎన్టీఆర్ తో పట్టాలెక్కించడానికి శౌర్యువ్ ఎన్నో రకాలుగా ప్రయత్నించాడు



కానీ తారక్ షెడ్యూల్ పలు సినిమాలతో లాక్ అయిపోవడంతో ఈ టాలెంటెడ్ డైరెక్టర్ అదే కథతో మరో హీరోని సంప్రదించినట్టు తెలుస్తోంది. ఆ హీరో మరెవరో కాదు టాలీవుడ్ టాలెంటెడ్ హీరో, రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి తో కింగ్‌డమ్ సినిమా చేస్తున్న విజయ్, ఆ తర్వాత రవికిరణ్ కోలా తో ఓ సినిమా, రాహుల్ సాంకృత్యాన్ తో ఓ సినిమాకు కమిట్ అయిన విషయం తెలిసిందే. ఈ రెండింటి తర్వాత విజయ్ చేయబోయే సినిమా శౌర్యువ్ తోనే అని సమాచారం. దీని గురించి ఇంకా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ లేదు కానీ ఇప్పటికే శౌర్యువ్- విజయ్ మధ్య డిస్కషన్స్ ఆఖరి దశకు చేరుకున్నాయంటున్నారు. అయితే గతంలో గౌతమ్ తిన్ననూరి, రామ్ చరణ్ తో సినిమా చేయాలనే ఆలోచనతో అతనికి ఓ కథ చెప్పగా, అది అనౌన్స్‌మెంట్ వరకు వచ్చి ఆగిపోయింది. అదే కథను గౌతమ్ ఇప్పుడు విజయ్ తో కింగ్‌డమ్ పేరుతో తెరకెక్కిస్తుండగా, ఇప్పుడు ఎన్టీఆర్ తో చేద్దామని శౌర్యువ్ రాసుకున్న కథను కూడా విజయే ఒప్పుకోవడం విశేషం.

## మహేష్-బన్నీల్లో ముందొచ్చేది ఎవరు?


ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ లుగా ఎస్ ఎస్ ఎంబీ 29- ఏఏ 22 చిత్రాలు హైలైట్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ లుగా ఎస్ ఎస్ ఎంబీ 29- ఏఏ 22 చిత్రాలు హైలైట్ అవుతోన్న సంగతి తెలిసిందే. సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తోన్న అడ్వెంచర్ థ్రిల్లర్ పై అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. ఇప్పటికే రెండు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా పాన్ ఇండియాని దాటి పాన్ వరల్డ్ నే షేక్ చేస్తుందనే అంచనాలున్నాయి. అటు ఐకాన్ స్టార్ 22 సెట్స్ కు వెళ్లకముందే భారీ అంచనాలు నెలకొంటున్నాయి. - రీ-రిలీజ్ బ్లాస్ట్: నార్త్ అమెరికాలో 'జవాన్' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత అట్లీ టేకప్ చేసిన ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. అయితే ఇప్పుడీ రెండు సినిమాల్లో ఏది ముందు రిలీజ్ అవుతుంది? అన్నది ఆసక్తికరంగా. ఎస్ ఎస్ ఎంబీ 29 రిలీజ్ ఏడాదిని



రాజమౌళి ఇంకా ప్రకటించలేదు. ఎలా లేదన్నా ఏడాదిన్నర తర్వాతే ఆ సినిమా రిలీజ్ ఉండే అవకాశం ఉంది. ఇంకా అంతకు మించే సమయం తీసుకునే ఛాన్స్ ఉంది. బన్నీ చిత్రం ఇంకా ప్రారంభమే కాలేదు. ఈ సినిమా మహేష్ కి పోటీగా ఎలా అంటారా? అట్లీ నుంచి రిలీజ్ అయిన సినిమా లేవి ఇంత వరకూ డిలే కాలేదు. చెప్పిన సమయానికే రిలీజ్ అయ్యాయి. అట్లీ వేగంగా పూర్తి చేసి రిలీజ్ చేస్తాడు. అయితే అవన్నీ కమర్శియల్ చిత్రాలు కాబట్టి సాధ్యమైంది. కానీ బన్నీ సినిమా టెక్నికల్ అంశాలతోనూ ముడి పడి ఉంది. అలాంటప్పుడు సమయం కూడా ఎక్కువగానే పడుతుంది. ఇప్పుడెలా సాధ్యమంటే? అట్లీ ప్రారంభానికి ముందే ఓ ప్రణాళికతో రంగంలోకి దిగాడు. ప్రీ ప్రొడక్షన్ స్టేజ్ నుంచే పోస్ట్ ప్రొడక్షన్ కి సంబంధించిన పనుల కోసం హాలీవుడ్ స్టూడియోలతో సంప్రదింపులు జరుపుతున్నాడు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## సీతమ్మ జీవితాన్నే మార్చేసిన ఘటన!




అనుకోకుండా ఓ రోజు ఓ స్నేహితురాలు మరాఠీ షో ఆడిషన్ గురించి చెప్పడంతో అక్కడ పాల్గొందిట. మరాఠీ మాతృ భాష కావడంతో పెర్ఫార్మెన్స్ తో ఇరగదీసిందట. మృణాల్ ఠాకూర్ అలియాస్ సతీమ కెరీర్ దేదీప్యమానంగ సాగిపోతున్న సంగతి తెలిసిందే. 'సీతారామం' సక్సెస్ తర్వాత గ్యాప్ వచ్చినా? వరుస ప్రాజెక్ట్ లతో ఒక్కసారిగా బిజీ అయింది. ప్రస్తుతం బాలీవుడ్ లోనే ఐదారు సినిమాలు చేస్తోంది. ఇందులో 'డెకాయిట్' చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీలోనూ తెరకెక్కి స్తున్నారు. తెలుగులో అవకాశాలు వస్తున్నా? కథలు నచ్చకపోవడంతో అంగీకరించడం లేదు. అలా చాలా ప్రాజెక్టులే వదులుకుంది. పారితోషికంతో పనిలేకుండా కేవలం కథాబలం...సవాల్ విసిరే పాత్రలే కావాలం టోంది. కథల విషయంలో అంత బలంగా నిలబడింది కాబట్టే సక్సెస్ లు అందుకుం టుంది. అయితే నటిగా ఇంత బిజీ అవ్వడానికి కారణమైన కెరీర్ మూలాలను మృణాల్ మరోసారి గుర్తు చేసుకుంది. నటన పట్ల తనకు ఉత్సాహం ఉన్నా? దాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో తెలియక చాలా ఇబ్బంది పడిందిట. తన కలను ఎలా స్వీకరిస్తారో తెలియక తనలో ఫ్యాషన్ ను గురించి ఎప్పుడూ కుటుంబ సభ్యులతో పంచు కోలేదుట. అనుకోకుండా ఓ రోజు ఓ స్నేహితురాలు మరాఠీ షో ఆడిషన్ గురించి చెప్పడంతో అక్కడ పాల్గొందిట.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com